క్లుప్తంగా

శేష వాహనంపై వెంకటేశ్వరుడు



మదనపల్లె సిటీ : స్థానిక దేవళంవీధిలోని శ్రీ ప్రసన్న వెంకటరమణస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం వెంకటేశ్వర స్వామి పెద్ద శేషవాహనంపై పురవీధుల్లో ఊరేగారు. స్థానిక శేషమహల్ ఏరియాకు చెందినవారు ఉభయదారులుగా వ్యవహరించారు. బ్రహ్మోత్సవాలను తిలకించేందుకు భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం అర్చకులు గోవర్ధన్‌భట్టార్ స్వామికి అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. బండమీదకమ్మపల్లె వాసులు ఉభయదారులుగా, హంసవాహనంపై స్వామి భక్తులకు దర్శనం కల్పించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ రమణ, ఆలయ కమిటీ మాజీ సభ్యులు పాల్గొన్నారు.

600 లీటర్ల సారా ఊట ధ్వంసం



సారా ఊట ధ్వంసం చేసిన సెబ్ అధికారులు

పీలేరు రూరల్ : తయారీకి సిద్ధంగా ఉంచిన 600 లీటర్ల సారా ఊటను ధ్వంసం చేసినట్లు సెబ్ సీఐ గురుప్రసాద్ తెలిపారు. మంగళవారం మండలంలోని మద్రిమాకులపల్లె తండా పరిసర ప్రాంతాల్లో విస్తృతంగా దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా సారా బట్టీలు గుర్తించి సారా తయారీకి సిద్ధం చేసిన ఊట ధ్వంసం చేసినట్లు తెలిపారు. ఈ దాడిలో అర్బన్ పీఎస్ సిబ్బంది, రాయచోటి డీటీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

పీలేరు ఇన్‌చార్జి తహసీల్దార్‌గా ప్రదీప్



పీలేరు : పీలేరు ఇన్‌చార్జి తహసీల్దార్‌గా కె.ప్రదీప్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇది వరకు ఇక్కడ తహసీల్దార్‌గా పని చేస్తున్న రవి బదిలీపై రాయచోటి కలెక్టరేట్‌కు వెళ్లారు. ఆయన స్థానంలో ములకలచెరువు డిప్యూటీ తహసీల్దార్‌గా పని చేస్తున్న కె.ప్రదీప్ పీలేరు ఇన్‌చార్జి తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

5న మేడికుర్తిలో పింక్ బస్ వైద్య సేవలు

కలికిరి : మండలంలోని మేడికుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం మహిళలకు తిరుపతి స్విమ్స్ ఆసుపత్రి వారి ఆధ్వర్యంలో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంప్ (పింక్ బస్) నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి కార్యాలయం నుంచి ప్రకటనలో తెలిపారు.శిబిరంలో 40 సంవత్సరాలు వయస్సు పైబడిన మహిళల్లో సంక్రమించే గర్భకోశ, కేన్సర్ నిర్ధారణ పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తారని తెలిపారు. అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

వాల్మీకిపురం : స్థానిక శ్రీ షిరిడిసాయి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ట్రస్టు చైర్మన్, పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి తెలిపారు. బుధవారం ఉదయం 9గంటలకు స్థానిక పంచాయతీ కార్యాలయ ఆవరణలో తిరుపతి అరవింద్ కంటి ఆసుపత్రి సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శిబిరానికి వచ్చే వారు ఆధార్‌కార్డు తమ వెంట తెచ్చుకోవాలని సూచించారు. అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పరిశుభ్రతపై అవగాహన కల్పించండి

పెద్దతిప్పసముద్రం : పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ మహమ్మద్ యస్థానీ సూచించారు. మంగళవారం ఆయన పీహెచ్‌సీ పరిధిలో పని చేసే ఆశా వర్కర్లు, ఏఎన్‌ఎంలతో సమీక్షించారు. డాక్టర్ మాట్లాడుతూ ఇళ్ళ పరిసరాల్లో నిల్వ ఉండే మురికి నీటి కారణంగా దోమలు విజృంభించి జ్వరాలు ప్రబలుతాయని, ఈ విషయాన్ని ప్రజలకు వివరించాలన్నారు. అదే విధంగా వేసవిలో వడదెబ్బ సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించాలన్నారు. ప్రధానంగా గర్భిణులకు పీహెచ్‌సీలో నెలవారి వైద్య పరీక్షలు చేయించి ప్రభుత్వ ఆసుపత్రిలోనే ప్రసవాలు అయ్యేలా చూడాలని హితబోధ చేశారు. అలాగే రక్తహీనత ఉన్న మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు.

నవరత్నాలతో ప్రజల జీవనం మెరుగు

ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

వాల్మీకిపురం : నవరత్నాలతో ప్రజల జీవనం మెరుగుపడిందని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. ప్రభుత్వ పాలనను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి దేశంలో ఎక్కడా లేని విధంగా సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేశారన్నారు. మంగళవారం మండలంలోని చింతపర్తి గ్రామంలోని తిరుపతి రోడ్డు, చెరువుముందరపల్లి, పాతకోటపల్లి, దాసరివారిపల్లి, పూజారివాండ్లపల్లి గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికి వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రోడ్లు, కాలువలు, విద్యుత్ స్తంభాలు, విద్యుత్ దీపాలు, పింఛన్లు, ఇండ్లు తదితర సమస్యలను ఎమ్మెల్యే చింతల దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే చింతల మాట్లాడుతూ ప్రజా సమస్యలను అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు ఆనందంగా ఉన్నారన్నారు. అందుకే గత మూడున్నర ఏళ్లుగా ఎక్కడ ఎన్నికలు జరిగినా వైఎస్సార్‌సీపీకి బ్రహ్మరథం పడుతున్నారన్నారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించడంలో వలంటీర్లు ముఖ్య భూమిక పోషిస్తున్నారన్నారు. సంక్షేమ పథకాల అమలు, రూపాయి లంచం లేకుండా నేరుగా అర్హులకే చేరే విధానం దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. అన్నివర్గాల వారికి మంచి చేస్తూ వస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అందరి గుండెల్లో కొలువై ఉన్నాడన్నారు. ప్రజలకు ఎలాంటి సమస్యలు ఎదురైనా వాలంటీర్ల ద్వారా అధికారుల దృష్టికి తీసుకొస్తే, సమస్యను పరిశీలించి పరిష్కరిస్తారని తెలిపారు. దేశంలోని ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు కూడా సీఎం జగన్మోహన్ రెడ్డి ప్రవేశ పెట్టిన వలంటీర్ వ్యవస్థ, ఇతర పథకాలు అమలు చేయాలనే ఆలోచనలో ఉన్నారన్నారు. అనంతరం మండలంలోని చింతలవారిపల్లి సమీపంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించి, ప్రతి కుటుంబానికి 100 రోజులు పనులు కల్పించి, తద్వారా రూ.27,200 లబ్ధి చేకూర్చాలన్నారు. అనంతరం ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ ప్యాకెట్లను అందించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ షబ్బీర్ అహ్మద్, నాయకులు రమేష్, లక్ష్మినారాయణ రెడ్డి, రామక్రిష్ణారెడ్డి, శ్రీనాథ రెడ్డి, నల్లంకి నరసింహులు, వెంకట్రమణ, కిరణ్ కుమార్, మోహన్ రెడ్డి, చెంగల్ రెడ్డి, మెంబర్ శీనా, ఫారుఖ్, నీళ్లభాస్కర్, రాయుడు, ఆనంద, రవి పాల్గొన్నారు.

నేడు ఉచిత ఖత్నా

వాల్మీకిపురం : పట్టణంలోని నాయక్‌వీధి మకాన్ వద్ద బుధవారం ముస్లింల పిల్లలకు ఉచిత ఖత్నా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ముస్లిం యువత ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు డాక్టర్ మస్తాన్ సాహెబ్ ఆధ్వర్యంలో ఉచిత ఖత్నా కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

వాల్మీకిపురం : ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ అన్నారు. మంగళవారం స్థానిక గాంధీ బస్టాండ్‌లో ఎర్ర జెండాను ఆవిష్కరించి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవర్లు ఐక్యంగా ఉండాలని, అందరూ లైసెన్సు తీసుకోవాలని సూచించారు. ఆటో డ్రైవర్లందరికీ వాహన మిత్ర పథకం ద్వారా రూ.10వేలు ఇవ్వాలని, డ్రైవర్లకు ఇబ్బంది లేకుండా 21 జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కేశవ రెడ్డి, నాయకులు క్రిష్ణప్ప, నరసింహులు, వెంకటేష్, సైదు, రెడ్డి మూర్తి, వెంకటనారాయణ, రఘు, బాబ్‌జాన్, ఇర్ఫాన్, షాకీర్, గౌస్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీల సమస్యలు పరిష్కరించండి

ములకలచెరువు : మండలానికి చెందిన ఎస్సీ, ఎస్టీల సమస్యలను అధికారులు పరిష్కరించాలని దళిత నాయకులు కోరారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దళిత నాయకులు మాట్లాడుతూ.. నెల నెలా మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించాలన్నారు. సమావేశంలో అధికారుల దృష్టికి వచ్చే సమస్యలు పరిష్కరించాలన్నారు. మండల పరిధిలో నాటుసారా తయారి అధికంగా ఉందని ఎస్‌ఈబీ అధికారులు వారి చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీ గ్రామాలకు స్మశాన వాటికల కోసం స్థలం కేటాయించాలని కోరారు.స అనంతరం తహసీల్దార్ శ్రీనివాసులు మాట్లాడుతూ... మానిటరింగ్ కమిటీ సమావేశంలో తమ దృష్టికి వచ్చే సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమం దళిత నాయకులు సుధాకర్, తిరుపాల్, ప్రసాద్, నరసింహులు, రెడ్డెప్ప, అంజప్ప తదితరులు ఉన్నారు.

నాటుసారా స్వాధీనం

ములకలచెరువు : అక్రమంగా విక్రయిస్తున్న నాటుసారా స్వాధీనం చేసుకొని నిందితుడిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఈబీ సీఐ మల్లిక మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ములకలచెరువు మండలం కదిరినాథునికోటకు చెందిన పి.సురేంద్ర (41) నాటుసారా విక్రయిస్తుండగా ముందస్తు సమాచారంతో దాడులు నిర్వహించి 10 లీటర్ల స్వాధీనం చేసుకున్నారు. ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకొని నింధితుడిని అరెస్టు చేసి రిమాండ్ తరలించినట్లు చెప్పారు. అదేవిధంగా సర్కిల్ పరిధిలోని పెద్దమండ్యం మండలం ఆర్‌ఎస్ తండాలో నాటుసారా వండుతున్నట్లు సమాచారం అందుకొని తన సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించి 300 లీటర్ల సారా ఊట ద్వంసం చేసినట్లు సీఐ పేర్కొన్నారు. సారా తయారు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రతిభావంతులను ప్రోత్సహించాలి



విద్యార్థిని శిల్పను అభినందిస్తున్న లలితమ్మ

మదనపల్లె : చదువులో ప్రతిభావంతులను ప్రోత్సహించాలని పోర్డ్ డైరెక్టర్, బాలలహక్కుల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షురాలు జల్లా లలితమ్మ అన్నారు. మంగళవారం పట్టణంలోని పోర్డ్ కార్యాలయంలో ఇంటర్ పరీక్షల్లో రాష్ట్రస్థాయిలో 1000 కి 991 మార్కులు సాధించిన శ్రీ జ్ఞానాంబిక జూనియర్ కళాశాల విద్యార్థిని సి.శిల్పకు అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జల్లా లలితమ్మ మాట్లాడుతూ..పేదలకు నాణ్యమైన విద్యను అందించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక పథకాలను ప్రవేశపెట్టారన్నారు. ప్రతి బిడ్డ చదువుకోవాలని, తన తరపున వారికి ఇవ్వగలిగే ఆస్తి చదువు మాత్రమేనని చెప్పడం అభినందనీయం అన్నారు. డబ్బున్న తల్లిదండ్రులు కార్పొరేట్ కళాశాలల్లో లక్షల రూపాయల ఫీజులు కట్టి ఉత్తమ ర్యాంకులు సాధించేందుకు తపన పడుతుంటే.. మదనపల్లె మండలం రామాపురం గ్రామంలో పేదరికంలో పుట్టి ఉన్నంతలో వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని రాష్ట్రస్థాయిలో అత్యధిక మార్కులు శిల్ప సాధించడంపై అభినందించారు. ఉన్నతస్థానాలకు వెళ్లాలనుకుంటున్న ప్రతిభ కలిగిన పేద ఆడబిడ్డలను తల్లిదండ్రులతో పాటుగా ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలన్నారు. శిల్ప తల్లిదండ్రులు వెంకటరత్నం, నిర్మలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకుని ఆడబిడ్డలను చదివించాలన్నారు. విద్యార్థిని సి.శిల్పకు చిరుసన్మానంతో పాటుగా ప్రోత్సాహక నగదు బహుమతిని అందించారు. కార్యక్రమంలో జ్ఞానాంబిక అకడమిక్ ప్రిన్సిపాల్ ఆర్.వెంకటాచలపతి, రమాదేవి, పోర్డ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రక్తహీనత నివారణకు చర్యలు



మాట్లాడుతున్న డీపీఎంఓ డాక్టర్ లోకవర్ధన్

వాల్మీకిపురం : రక్తహీనత నివారణకు చర్యలు తీసుకోవాలని జాతీయ ఆరోగ్య మిషన్ అధికారి డాక్టర్ లోకవర్ధన్ అన్నారు. మంగళవారం మండలంలోని చింతపర్తి పీహెచ్‌సీలో ఆశా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కిశోర బాలికలు, గర్భిణులు, బాలింతలు రక్తహీనత నివారణ కోసం మంచి సమతుల ఆహారం తీసుకోవాలన్నారు. ఐరన్ ఎక్కువగా ఉన్న ఆహారం తీసుకోవడం, రాగులతో తయారు చేసిన వంటలు, బెల్లంతో తయారు చేసిన పిండి వంటలు, బాలామృతం, కోడిగుడ్లు వంటి పౌష్టికాహారం తీసుకోవడం వలన ఎనీమియాను నివారించవచ్చునన్నారు. రక్తహీనత తగ్గిస్తే మాతా, శిశు మరణాలు తగ్గుతాయన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు మానస, శ్రీవిద్య, సిహెచ్‌వో ఇందిరారాణి, హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ, సూపర్‌వైజర్లు సుధాకర్, పూర్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలి



జిల్లా ఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న గ్రామ సచివాలయ మహిళా పోలీసులు

మదనపల్లె : గ్రామసచివాలయ మహిళా పోలీసులకు రెవెన్యూ, ఇతర విధుల నుంచి మినహాయింపు కల్పించాలని కోరుతూ జిల్లా ఎస్పీ ఆర్.గంగాధర రావుకు మదనపల్లె మండల గ్రామ సచివాలయ మహిళా పోలీసులు మంగళవారం వినతిపత్రం సమర్పించారు. మదనపల్లె పర్యటనలో భాగంగా డీఎస్పీ కార్యాలయానికి వచ్చిన ఎస్పీని సచివాలయ మహిళా పోలీసులు మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మహిళా పోలీసులు మాట్లాడుతూ.. తాము పోలీసులమైనా... మెడికల్, రెవెన్యూ, పంచాయతీరాజ్‌శాఖలకు సంబంధించిన విధులు నిర్వహించాల్సి వస్తోందన్నారు. ఆ శాఖల అధికారులు సిబ్బంది నుంచి ఒత్తిళ్లు, వేధింపులు ఎక్కువైనట్లు ఆవేదన వ్యక్తం చేశారు. కొద్దిరోజులుగా ఉద్యోగరీత్యా తాము ఎదుర్కొంటున్న సమస్యలను ఎస్పీకి వివరించారు. దీనిపై స్పందించిన ఎస్పీ గంగాధరరావు మాట్లాడుతూ మహిళా పోలీసుల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో డీఎస్పీలు కేశప్ప, సుధాకర్, సీఐలు మురళీకృష్ణ, సత్యనారాయణ, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్‌ఐ పి.రామకృష్ణ

నిమ్మనపల్లె : రౌడీషీటర్లు సత్ప్రవర్తన కలిగి ఉండాలని స్థానిక ఎస్‌ఐ పి.రామకృష్ణ అన్నారు. మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వివిధ కేసుల్లో రౌడీషీటర్లుగా నమోదైన వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. సమాజంలో యువత బాగా చదువుకుని, జీవితంలో మంచిస్థాయికి ఎదగాల్సిన సమయంలో ఆవేశాల కారణంగా జరిగిన గొడవల్లో రౌడీషీటర్లుగా ముద్రపడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. రౌడీషీటర్లగా నమోదైన ప్రతి ఒక్కరిపై పోలీసుల నిఘా నిత్యం కొనసాగుతుందన్నారు. పోలీసు నిబంధనల మేరకు ఎటువంటి గొడవలలో, చట్టవ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొనకుండా మంచి ప్రవర్తనతో జీవనం సాగించే వారిపై భవిష్యత్తులో రౌడీషీట్ తొలగించడానికి అవకాశం ఉందన్నారు. మద్యపానం, గంజాయి, మాదకద్రవ్యాల వినియోగం, అసాంఘిక కార్యకలాపాలకు యువత దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

తారు రోడ్డు పనులు పూర్తి



పూర్తి అయిన రాయచోటి-అంగళ్లు రోడ్డు

కురబలకోట: జిల్లా కేంద్రం రాయచోటికి తారు రోడ్డు పనులు దాదాపుగా పూర్తయ్యాయి. రాయచోటి నుంచి అంగళ్లు కూడలి వరకు రూ. 316 కోట్ల వ్యయంతో డబుల్ రోడ్డు పనులు చేపట్టారు. ఇప్పటికే తారు రోడ్డు పనులు పూర్తి కావడంతో వాహనదారులు కూడా రయ్..రయ్ మని దూసుకెళుతున్నారు. మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాల వారు జిల్లా కేంద్రం రాయచోటి వెళ్లాలంటే ఇదే ప్రధాన మార్గం. వాహనదారులు, ప్రయాణికులు, బాటసారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డును విస్తరించడం ఆపై దశాబ్దాల సమస్య తీరడంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించేవారు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వైభవంగా నారసింహుడి రథోత్సవం



నారసింహుడి రథోత్సవం

మదనపల్లె సిటీ : గోవిందనామ స్మరణలతో నారసింహుడి రథోత్సవం వైభవంగా సాగింది. మదనపల్లె మండలం సీటీఎంలోని శ్రీలక్ష్మి నరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం భక్తులు గోవింద నామాలు జపిస్తూ రథాన్ని లాగారు. రథోత్సవం సందర్భంగా భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. రథంపై ఉప్పు, మిరియాలు, నాణేలు చల్లారు. అడుగడుగునా భక్తులు నీరజనాలు పలికారు. బాలాజీమిల్స్ ఉదయదారులుగా వ్యవహరించారు. బుడ్డా, పోకల, దేశి, మోడే, పేర, మైలంవారి కుటుంబాలు భక్తులకు అన్నదానం చేశారు.

కురబలకు రాజకీయ ప్రాధాన్యత



మాట్లాడుతున్న జబ్బల శ్రీనివాసులు

మదనపల్లె : సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో కురబలకు ఇతర పార్టీలు చేయని విధంగా రాజకీయ ప్రాధాన్యత ఇచ్చి గౌరవప్రదమైన స్థానాల్లో అవకాశం కల్పించారని ఏపీ కురుబ, కురుమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జబ్బల శ్రీనివాసులు అన్నారు. మంగళవారం పట్టణంలోని కురుబ సంఘం రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాయలసీమ జిల్లాల్లో కురబలకు జనాభా ప్రాతిపదికన ఎంపీ, రెండు ఎమ్మెల్యే స్థానాలతో పాటుగా 30 ఏళ్ల తర్వాత తొలిసారిగా మంత్రివర్గంలో స్థానం కల్పించారన్నారు. కర్నూలు జిల్లాలో మున్సిపల్ చైర్మన్ లుగా, బీసీ, స్టేట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్, డైరెక్టర్ లుగా నామినేటెడ్ పదవులు కేటాయించారన్నారు. టీడీపీ ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బీసీలను వెన్నెముకగా పేర్కొంటూ, నడ్డివిరిచి వాత పెట్టారని చెప్పారు. కర్నాటకలో అసెంబ్లీ ఎన్నికల్లోనూ అక్కడి రాజకీయపార్టీలు కురబలకు 27 స్థానాల్లో ఎమ్మెల్యే సీట్లు కేటాయించడంపై హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కురుబ, కురుమ సంఘాన్ని బలోపేతం చేసే దిశగా నూతన జిల్లాల వారీగా కార్యవర్గాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. అన్నమయ్యజిల్లా రాజంపేట పార్లమెంటరీ పరిధిలోని మదనపల్లె, పీలేరు, తంబళ్లపల్లె, రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాల్లోని కురుబ కులస్థులందరితో ప్రత్యేకంగా సమావేశమై నూతన కార్యవర్గ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రాయచోటిలో ఈనెల 14న జిల్లా కురుబ మహిళ, యువత, వాణిజ్యవిభాగాలను ఎంపిక చేస్తామన్నారు. సమావేశంలో నాయకులు కప్పలరాజన్న, గుడిరామాంజులు, గుడిశ్రీనివాసులు, రాజ్‌కుమార్, సాంబశివ తదితరులు పాల్గొన్నారు.

బెంగళూరు వెళ్లి పింఛన్ అందజేత



పింఛన్ నగదు అందజేస్తున్న వలంటీర్ మంజునాథరెడ్డి



ఆసుపత్రిలో లబ్ధిదారుని బయోమెట్రిక్ తీసుకుంటున్న వలంటీర్ రాజేశ్వరి

బి.కొత్తకోట : రోడ్డు ప్రమాదంలో గాయపడి బెంగళూరు ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న వ్యక్తికి మంగళవారం వలంటీర్ పింఛన్ అందించారు. బి.కొత్తకోట నగర పంచాయతీ దేగానిపల్లెకు చెందిన డి.ఆంజనేయరెడ్డి ప్రమాదంలో గాయపడి బెంగళూరు సెయింట్‌జాన్స్ ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతున్నాడు. ప్రభుత్వం అందిస్తున్న పింఛన్ గతనెల కూడా తీసుకోలేదు. ఈనెల కూడా తీసుకోకపోతే పింఛన్ ఆగిపోతుందని గుర్తించిన వలంటీర్ ఎం.మంజునాథ రెడ్డి 120 కిలోమీటర్ల దూరంలోని బెంగళూరుకు వెళ్లి ఆంజనేయరెడ్డికి రెండునెలల పింఛన్ అందించాడు.

తిరుపతికి వెళ్లి ..

పెద్దతిప్పసముద్రం : మండలంలోని మడుమూరు గ్రామ పంచాయతీకి చెందిన సరోజమ్మ అనారోగ్యం కారణంగా తిరుపతిలోని డీబీఆర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఈ నేపథ్యంలో గ్రామ వలంటీర్ రాజేశ్వరి 170 కిలోమీటర్ల దూరంలో చికిత్స పొందుతున్న వృద్ధురాలి వద్ద వేలిముద్రలు తీసుకుని వైఎస్సార్ పెన్షన్ కానుక అందజేసింది. దీంతో లబ్ధిరాలు సంతోషం వ్యక్తం చేసింది.

సంఘమిత్రలకు లోకోస్ యాప్‌పై శిక్షణ



లోకోస్ యాప్‌పై శిక్షణ ఇస్తున్న ఏపీఎం రజినికుమారి

నిమ్మనపల్లె : డ్వాక్రా సంఘాల సంఘ మిత్రలకు లోకోస్ యాప్ వినియోగంపై శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం స్థానిక మహిళా సమాఖ్య కార్యాలయంలో ఏపీఎం రజినికుమారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భారతగ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రప్రభుత్వం చేపట్టిన గ్రామీణ పేదరికి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా డ్వాక్రా సంఘమిత్రలకు లోకోస్ యాప్ వినియోగంపై జిల్లాస్థాయిలో నాలుగురోజులపాటు శిక్షణను ఇస్తున్నట్లు తెలిపారు. డ్వాక్రా సంఘ సభ్యులు యాప్‌ను వినియోగించడంద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. లోకోస్‌యాప్‌లో పొదుపు నగదు చెల్లింపు, లావాదేవీలు, స్టేట్మెంట్‌ను తయారుచేసుకునేందుకు సౌకర్యంగా ఉంటుందన్నారు. సంఘ సభ్యురాలు తమ ప్రాథమిక సమాచారం, బ్యాంకు లావాదేవీలతో పాటు మహిళా సమాఖ్యకు సంబంధించిన ఇతర కార్యక్రమాలకు వినియోగించుకోవచ్చని సూచించారు. లోకోస్‌యాప్ వినియోగంపై డ్వాక్రా మహిళలకు అవగాహన కల్పించేందుకు ముందుగా సంఘమిత్రలకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీసీలు, సెక్రటరీ, సంఘమిత్రులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

మదనపల్లె : రోడ్డు ప్రమాదంలో ఒకే పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయుడు, క్లర్క్ తీవ్రంగా గాయపడిన సంఘటన మంగళవారం రాత్రి మదనపల్లెలో జరిగింది. పట్టణంలోని ప్రశాంత్ నగర్ కు చెందిన వెంకటరమణ (40), ములకలచెరువు మండలం బురకాయల కోట హైస్కూల్లో క్లర్క్ గా పని చేస్తున్నాడు. రెడ్డీస్ కాలనీకి చెందిన రామ్మూర్తి (35), అదే పాఠశాలలో ఎస్జీటీ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు. వీరిద్దరూ కలిసి ద్విచక్ర వాహనంలో వ్యక్తిగత పనులపై, పట్టణంలోని పుంగనూరు రోడ్డులో వెళ్తుండగా, కనములో గంగమ్మ గుడి వద్ద టాటా మోటార్స్ సమీపంలో వేగంగా ఎదురుగా వచ్చిన కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ప్రమాదంలో వెంకటరమణ, రామ్మూర్తి ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు బాధితులను 108 అంబులెన్స్ వాహనంలో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు వెంకటరమణ పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతి స్విమ్స్‌కు రెఫర్ చేశారు. ఉపాధ్యాయుడు రామ్మూర్తి సైతం ప్రమాదంలో తీవ్రంగా గాయపడగా, పరిస్థితి విషమంగా ఉన్నట్లు డాక్టర్లు చెప్పారు.

ఆదరించండి .. అభివృద్ధిలో అగ్రగామిగా నిలుపుతాం

- తంబళ్లపల్లెలో గడప గడపకు మన ప్రభుత్వం
- ఉపాధి, అధికారులతో సమీక్షా సమావేశం



నాడు-నేడు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి

తంబళ్లపల్లె : రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని ఆదరించండి.. నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధిలో రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలిపేందుకు తమ వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి అన్నారు. మంగళవారం తంబళ్లపల్లెలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళుతూ ప్రజలను పలకరిస్తూ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కొన్ని సమస్యలను సంబంధిత అధికారులతో అక్కడికక్కడే పరిష్కరించారు. తూర్పు హరిజనవాడ ప్రాథమిక పాఠశాలలో రెండోవిడత నాడు-నేడులో రూ.12 లక్షలతో చేపట్టనున్న పనులకు శంకుస్థాపన చేశారు.

పార్టీలకు అతీతంగా పనులు చూపాలి

నియోజకవర్గంలో ఉపాధి హామీ పథకం పనులను పార్టీలకు అతీతతంగా ప్రజలు కోరిన వెంటనే చూపాలని ఎమ్మెల్యే ఉపాధి అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. ఎంపీడీఓ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి సిబ్బందితో సమీక్షా నిర్వహించారు. ఇప్పటి వరకు ఎలాంటి విమర్శలు, ఆరోపణలు లేవని ఉపాధి పనులు నిర్వహించిన అధికారులు, సిబ్బంది అభినందించారు. ఉద్యాన పంటలు, అవెన్యూ ప్లాంటేషన్‌కు మొదటి ప్రాధాన్యత కల్పించాలని సూచించారు. జిల్లా ఉపాధి హామీ పీడీ మద్దిలేటి మాట్లాడుతూ ఉపాధి హామీ సిబ్బంది ఉద్యోగ భద్రత అధికారుల చేతుల్లో ఉండదన్నారు. సిబ్బంది సమన్వయంతో కూలీలకు పనులు కల్పించి అనుకున్న లక్ష్యాలను సాధిస్తే మీ ఉద్యోగ భద్రత మీచేతుల్లో ఉంటుందన్నారు. సుమారు 200 ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగు చేసేందుకు రైతులను చైతన్యపరచాలన్నారు.

ప్రజా సేవలతో గుర్తింపు

గ్రామ వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు ప్రజలకు సకాలంలో సేవలు అందించినప్పుడే గుర్తింపుతో పాటు గౌరవం పెరుగుతుందని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో సచివాలయ ఉద్యోగులు, గ్రామవాలంటీర్లు,జెసీఎస్ కన్వీనర్లు,సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో సమీక్షా నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ సురేంద్ర, సింగిల్‌విండో అధ్యక్షులు భార్గవ్‌రెడ్డి,రైతుసంఘం నాయకులు జయసింహారెడ్డి, స్థానిక సర్పంచు నీలూఫర్, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ నారాయణరెడ్డి, మల్లయ్యకొండ చైర్మన్ మల్‌రెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షులు సుధాకర్‌రెడ్డి, నాయకులు గంట్ల సురేంద్ర, శివారెడ్డి, కోటిరెడ్డి, రామమూర్తి, కరీమ్, భాస్కర్‌రెడ్డి, పద్మనాభరెడ్డి తదితరులు పాల్గొన్నారు.